సాక్షి ఖమ్మం



గురువారం । 2 । అక్టోబర్ । 2025

న్యూస్‌రీల్

జయ జయహే మహిషాసుర మర్దిని



పూజలు అందుకుంటున్న అమ్మవారు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం ఆలయ యాగశాలలోని అమ్మ వారిని మహిషాసుర మర్దిని రూపంలో అలంకరించగా పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తొలుత స్వామి వారికి అర్చకులు పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస శర్మ, అర్చకులు ఉప్పల మురళీమోహన్‌శర్మ, రాజీవ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలి

ఖమ్మం సహకారనగర్: స్థానిక సంస్థల ఎన్నికల విధులకు ఎంపికైన ఉద్యోగులు పకడ్బందీగా నిర్వహించాలని మాస్టర్ ట్రైనర్, జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్ సూచించారు. ఖమ్మంలోని డీపీఆర్‌సీ భవనంలో బుధవారం నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ శ్రీరామ్ మాట్లాడుతూ అధికారులు వారి విధులు, నిబంధనలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. హ్యాండ్ బుక్ ఒకటికి, రెండు సార్లు పరిశీలించాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు ప్రక్రియలో జాగ్రత్త వహించాలని ఆయన తెలిపారు.

మొదటి దరఖాస్తు..

ఖమ్మంక్రైం: నూతన ఎక్సైజ్ పాలసీలో భాగంగా జిల్లాలోని 116 వైన్స్ దుకాణాలకు గాను గత నెల 26వ తేదీ నుండి దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. అయితే, ఇన్నాళ్లు ఎవరూ ముందుకు రాకపోగా బుధవారం ఒక దరఖాస్తు నమోదైంది. ఖమ్మం ఎక్సైజ్‌స్టేషన్-1 పరిధి రఘునాథపాలెంలోని వైన్‌షాప్‌నకు ఈ దరఖాస్తు అందించారు. జిల్లా ఎక్సైజ్ శాఖాధికారి నాగేందర్‌రెడ్డి, సీఐ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'రాంరెడ్డి'తో మృతితో పాతలింగాలలో విషాదం

మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి కన్నుమూత



దామోదర్ రెడ్డి (ఫైల్)

కామేపల్లి: కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి (73) బుధవారం రాత్రి మృతి చెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరా బాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. దామోదర్‌రెడ్డి స్వగ్రామం జిల్లాలోని కామేపల్లి మండలం పాతలింగాల. దివంగత రాంరెడ్డి నారాయణరెడ్డి-కమలమ్మ దంపతులకు ఆరో సంతానంగా దామోదర్‌రెడ్డి జన్మించారు. తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల నుంచి ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన.. మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. ఏళ్లుగా తుంగతుర్తిలో స్థిరపడినా స్వగ్రామమైన పాతలింగాలలో ఏ శుభ కార్యం జరిగినా వచ్చేవారు. ఆయన భార్య గతంలోనే మృతి చెందగా, కుమారుడు సర్వోత్తమరెడ్డి ఉన్నారు. కాగా, దామోదర్‌రెడ్డి మృతితో స్వగ్రామమైన పాతలింగాలలో విషాదం నెలకొంది. దామోదర్‌రెడ్డి సోదరుడు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి ప్రస్తుతం రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడిగా కొనసాగుతున్నారు. కాగా, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మృతిపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.

విజయ వేడుక.. దసరా



విద్యుత్ లైట్ల అలంకరణలో ఖమ్మంలోని జమ్మిబండ

ఊరూవాడ పండుగ సందడి

- ఖమ్మం జమ్మిబండపై వేడుకలు ప్రత్యేకం
- మైసూర్‌ను తలపించేలా ఇల్లెందులో ఉత్సవాలు
- భద్రాచలంలో శ్రీరామ్‌లీలా ఉత్సవంగా నిర్వహణ

ఖమ్మంగాంధీచౌక్: ఆనందాలను నింపే పండుగ దసరా. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమి జరుపుకోవడం ఆనవాయితీ. దసరా పండుగను గురువారం అంగరంగ వైభవంగా జరుపుకునేందుకు జిల్లా ప్రజలంతా సిద్ధమయ్యారు. ఇప్పటికే దూర ప్రాంతాల్లో ఉన్న వారు స్వస్థలాలకు చేరారు. ఉమ్మడి జిల్లాలో ప్రత్యేకంగా దసరా వేడుకలు పలుచోట్ల నిర్వహిస్తారు. ఆయా ప్రాంతాల్లోనూ వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

శమీ పూజ ప్రత్యేకం

దసరా రోజున శమీ చెట్టు పూజ విశేషంగా నిలుస్తోంది. ఈ చెట్టును పూజించటం లక్ష్మీ ప్రదమని చెబుతారు. విజయదశమి రోజున జమ్మి చెట్టు ఆకులను ఇంట్లోని పూజా స్థలంలో పెడితే అంతామంచి జరుగుతుందని నమ్మిక. పాండవులు అజ్ఞాత వాసానికి వెళ్లేముందు తమ ఆయుధాలను శమీ చెట్టుపై పెట్టారని ప్రతీతి. కాగా, విజయదశమి రోజున ఏ పని చేపట్టినా విజయం సొంతమవుతుందని నమ్ముతారు. అందుకే కొత్త వ్యాపారాలు ప్రారంభించేందుకు పలువురు సిద్ధమవుతుండగా వాహనాల కొనుగోళ్లు జోరుగా సాగనున్నాయి.

ఖమ్మంలో జమ్మిబండ

దసరా పండుగకు ఖమ్మంలో ప్రత్యేకత ఉంది. ఖమ్మంకు మూలమైన శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి నడిబొడ్డున గుట్టపై 16వ శతాబ్దంలో వెలిశాడు. అయితే, దసరా రోజు పూజలకు అడవుల మధ్య ఉన్న గుట్టపైకి వెళ్లడానికి భక్తులు ఇబ్బంది పడుతుండడంతో స్వామి ఉత్సవ విగ్రహాన్ని గుట్ట కింద జమ్మిచెట్టు, బండ ఉన్న ప్రాంతానికి తీసుకొచ్చి పూజలు చేయడం ఆనవాయితీగా మారింది. దసరా రోజు స్వామి వారిని గుట్టపై ఆలయం నుంచి పల్లకీలో ఊరేగింపుకు జమ్మిబండకు తీసుకొచ్చి అక్కడ రాతిమండపంపై ప్రభుత్వ లాంచనాలతో పూజల చేస్తారు. గురువారం సాయంత్రం 5గంటలకు పూజలు మొదలుకానుండగా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు తెలిపారు.

శ్రీరామలీలా మహోత్సవ్



ఉత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈఓ దామోదర్‌రావు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. రామదాసు కాలం నుంచి ఆలయం తరఫున రామ్‌లీలా ఉత్సవంగా జరపడం ఆనవాయితీ కాగా, ఈ వేడుకలకు దసరా మండపం వేదిక కానుంది. ఈ సందర్భంగా గురువారం శ్రీ సీతాలక్ష్మణ సమేత రామచంద్రస్వామిని పల్లకీ సేవగా దసరా మండపంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం జమ్మి చెట్టు వద్ద శమీ, ఆయుధ పూజలు చేస్తారు. రావణాసుర వధగా జరిపే శ్రీ రామలీలా మహోత్సవానికి ఆలయ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వేడుక నేపథ్యంలో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా పోలీసు, అగ్నిమాపక సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించారు.

ఇల్లెందు.. మరో మైసూర్



ముస్తాబవుతున్న సింగరేణి హైస్కూల్ మైదానం

ఇల్లెందు: దసరా వేడుకలకు ఇల్లెందులోని సింగరేణి హైస్కూల్ గ్రౌండ్ ముస్తాబైంది. ఇక్కడ మైసూర్‌ను తలపించే రీతిలో ఏళ్లుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అయితే, ఇప్పటి వరకు పాలపిట్ట బొమ్మను మాత్రమే ఉంచేవారు. కానీ ఈ దఫా నిజమైన పాలపిట్ట ప్రత్యక్షంగా కనిపించనుందని ఉత్సవ కమిటీ ప్రకటించింది. అంతేకాక భక్తుల్లో జోష్ నింపేలా సినీ, టీవీ నటులతో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామని దసరా ఉత్సవ మండలి బాధ్యులు తెలిపారు.

వేడుక చూడాలంటే పెద్దమ్మగుడికి వెళ్లాల్సిందే..



కోనేటిలో అమ్మవారి జలవిహారం కోసం సిద్ధం చేసిన బోటు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని పెద్దమ్మతల్లి ఆలయం దసరా వేడుకలకు ప్రత్యేకంగా నిలుస్తోంది. ఇక్కడ నిర్వహించే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతాయి. చివరి రోజున దసరాను పురస్కరించుకుని శమీ పూజ కూడా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తారు. ఈ పూజలు వీక్షించడానికి తెలంగాణతో పాటు ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివస్తారు. ఈ మేరకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగా, గతేడాది ఉత్సవాల నిర్వహణకు రూ.10 లక్షల మేర వెచ్చించగా, ఈ సారి కూడా అంతే మొత్తంలో ఖర్చు చేయనున్నట్లు తెలిసింది. నవరాత్రి మహోత్సవాల చివరి రోజైన గురువారం.. పెద్దమ్మతల్లి ఆలయం ఎదుట గల జమ్మి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేస్తారు. ఇందుకోసం విద్యుద్దీపాలతో అలంకరించడంతో పాటు భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈఓ రజనీకుమారి వెల్లడించారు.

హద్దులు దాటిన దందా

- అటవీ శాఖ పర్మిట్‌లో లొసుగులతో స్మగ్లర్ల బరితెగింపు
- అనుమతి ఉన్న కలప మాటున విలువైన కలప తరలింపు
- సైబర్ క్రైంగా గుర్తించి విచారణ చేపట్టిన అటవీ శాఖ
- అటవీ శాఖ ఉద్యోగుల ప్రమేయంపైనా ఆరా



ఖమ్మంవ్యవసాయం: అటవీ శాఖ కళ్లు కప్పి యథేచ్ఛగా పొరుగు రాష్ట్రాలకు కొందరు కలపను అక్రమంగా రవాణా చేస్తున్నారు. కలప రవాణాకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 'నేషనల్ ట్రాన్సిట్ పర్మిట్(ఎన్‌టీపీసీ)' నిబంధనల్లో లొసుగుల ఆధారంగా దందాకు పాల్పడుతున్నట్లు బయటపడింది. ఎన్టీపీసీ విధానంలో 44జాతుల కలపను అన్ని అనుమతులు, తగిన ఆధారాలతో రవాణా చేసే అవకాశం ఉంది. ఇందుకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, కలప వివరాలు, ఏ ప్రాంతానికి చెందినది, ఏయే సర్వేనంబర్లలో చెట్లు నరికారు తదితర వివరాలు పొందుపర్చాలి. అయితే, కొన్ని లొసుగులను కలప స్మగ్లర్లు తమకు అనుకూలంగా మార్చుకుని అనుమతి ఉన్న కలప మాటున విలువైన కలపను ఉత్తరాది రాష్ట్రాలకు స్మగ్లింగ్ చేస్తున్నారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం అటవీ ప్రాంతం నుంచి అనుమతి ఉన్న కలప పేరిట తరలిస్తున్నట్లు వాహనాన్ని మధ్యప్రదేశ్ రాష్ట్రంలో అటవీ అధికారులు తనిఖీ చేయగా విలువైన సంద్ర కర్ర బయటపడింది. దీంతో అక్కడి అధికారులు ఇచ్చిన సమాచారం ఆధారంగా రాష్ట్ర అటవీ శాఖ కలప విచారణ మొదలుపెట్టింది.

24 పర్మిట్లు.. వందలాది టన్నులు

నేషనల్ పర్మిట్ విధానాన్ని అడ్డం పెట్టుకుని సర్కారు తుమ్మ వంటి కలపను రవాణా చేస్తున్నట్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని అక్రమార్కులు అనుమతి పొందారు. ఆపై సంద్రతో పాటు ఇతర విలువైన జాతుల కలపను మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్ తదితర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఖమ్మం జిల్లా నుంచి కొందరు వ్యాపారులు 24 పర్మిట్లతో వందలాది మెట్రిక్ టన్నుల కలపను రవాణా చేసినట్లు మధ్యప్రదేశ్ అటవీ అధికారులు గుర్తించారు. వీటితో పాటు తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచి స్మగ్లింగ్ ముఠా ఉత్తరాది రాష్ట్రాలకు రవాణా చేసినట్లు సమాచారం.

సైబర్ క్రైంగా గుర్తింపు

కొందరు అక్రమార్కులు అనుమతి లేని కలపను రవాణా చేసిన వ్యవహారాన్ని అటవీ శాఖ సైబర్ క్రైంగా గుర్తించింది. ఆన్‌లైన్ దరఖాస్తులో వివరాలు తప్పుగా నమోదు చేయడం, అడవి లేని ప్రాంతాలను అటవీ ప్రాంతాలుగా చూపడం, లేని కలపను ఉన్నట్లు సృష్టించడంతో సైబర్ క్రైంగా నిర్ధారించినట్లు తెలిసింది. దీంతో పాటు నిర్దేశించిన కలప మాటున అనుమతి లేని, విలువైన కలప జాతులను రవాణా చేయడాన్ని నేరంగా గుర్తించి ఆయా అంశాలపై విచారణ చేపట్టింది. కాగా, కలప రవాణాకు స్థానిక లారీలు కాకుండా రాజస్థాన్, మహారాష్ట్ర లారీలను వినియోగించినట్లు గుర్తించారు. ఈమేరకు మార్గమధ్యలోని చెక్‌పోస్టుల వద్ద వివరాలు సేకరిస్తున్నారు.

ఉద్యోగుల పాత్ర ఉందా?

కలప అక్రమ తరలింపు వ్యవహారంలో అటవీ శాఖ అధికారులు, ఉద్యోగుల ప్రమేయం ఉందా అన్న అంశంపైనా ఉన్నతాధికారులు దృష్టి సారించారు. కలప రవాణా వాహనాలను అటవీ అధికారులు, టాస్క్‌ఫోర్స్ బృందాలతో పాటు చెక్‌పోస్టుల సిబ్బంది తనిఖీ చేయాల్సి ఉంటుంది. అయినప్పటికీ జిల్లా, రాష్ట్రం దాటి లారీలో వెళ్లడంతో సిబ్బంది ప్రమేయం అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈమేరకు ఆయా ప్రాంతాల్లోని ఉద్యోగుల వివరాలు సేకరించి విచారణ చేపడుతున్నారు. కాగా, ఖమ్మం జిల్లాలో అటవీ ప్రాంతం తక్కువగానే ఉండగా పొరుగున ఉన్న భద్రాద్రి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో విస్తారంగా ఉన్న అటవీ ప్రాంతం నుంచి విలువైన కలపను దొంగచాటుగా రవాణా చేస్తున్న అంశంపై బయటపడడం చర్చనీయాంశంగా మారింది.

రాష్ట్రమంతా వివరాలు ఆరా



నేషనల్ ట్రాన్సిట్ పర్మిట్ విధానాన్ని అడ్డుపెట్టుకొని అక్రమ కలప రవాణాపై రాష్ట్ర వ్యాప్తంగా అటవీ శాఖ అప్రమత్తమైంది. ఇప్పటికే బయటపడిన అక్రమాలపై విచారణ చేపడుతున్నాం. ప్రస్తుతం సేకరించిన ఆధారాల మేరకు ఇంకా ఏయే ప్రాంతాల నుంచి, ఎంత మేర కలప అక్రమ రవాణా జరిగిందనే అంశాన్ని ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. ఇదేసమయాన ఉద్యోగుల పాత్రపైనా విచారణ చేస్తున్నాం.

– సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, జిల్లా అటవీ అధికారి

సమస్యలపై పోరాడే అభ్యర్థులను గెలిపించండి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ఖమ్మంమయూరిసెంటర్: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై పోరాడే సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శులతో బుధవారం ఆయన స్థానిక సంస్థల ఎన్నికలపై సమీక్షించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు జరగకపోవడంతో పాలన వ్యవస్థ గాడి తప్పిందన్నారు. ప్రజాప్రతినిధులే లేకపోవడంతో పాలనలో శూన్యత ఏర్పడి, సమస్యలు పేరుకుపోయాయని తెలిపారు. ఇదే అవకాశంగా కేంద్ర ప్రభుత్వం గ్రామాలకు ఇవ్వాల్సిన నిధులు నిలిపివేసిందన్నారు. కాగా, ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీజేపీ, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా భావసారూప్య పార్టీలు, లౌకిక, ప్రజాస్వామిక శక్తులు, వామపక్ష పార్టీలతో స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి ముందుకెళ్తామని తమ్మినేని తెలిపారు. ఈమేరకు పార్టీ శ్రేణులు ఎన్నికలకు సిద్ధమై సీపీఎం అభ్యర్థులను గెలిపిస్తే ప్రజలకు అండగా ఉంటారనే నమ్మకం కల్పించాలని సూచించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు, మాచర్ల భారతి, బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇరవై రోజుల్లోగా సీఎంఆర్ పూర్తి

అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం సహకారనగర్: పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్)ను ఇరవై రోజుల్లోగా మిల్లర్లు అందజేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన రైస్ మిల్లర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పెండింగ్ ఉన్న 11,500 మెట్రిక్ టన్నులు రారైస్, 3,500 మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్‌ను ఇరవై పని దినాల్లో ఎఫ్‌సీఐకి అందించాలని తెలిపారు. ఇదే సమయాన ఎఫ్‌సీఐ అధికారులు గోదాంలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఇక రబీ సీజన్‌కు సంబంధించి పెండింగ్ ఉన్న 42 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని రోజుకు 600 మెట్రిక్ టన్నుల మేర సరఫరా చేయాలని తెలిపారు. రవాణా చార్జీల బిల్లులను మిల్లర్లు సమర్పిస్తే ప్రభుత్వానికి పంపిస్తామని చెప్పారు. కాగా, రేషన్‌షాపుల్లో పంపిణీ చేసే బియ్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించిన అదనపు కలెక్టర్.. ఖరీఫ్ ధాన్యం కేటాయింపుల కోసం తప్పనిసరి 10 శాతం బ్యాంకు గ్యారెంటీ సమర్పించాలని సూచించారు. జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, ఎఫ్‌సీఐ అధికారులు, మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బొమ్మ రాజేశ్వర్‌రావుతో పాటు పలువురు మిల్లర్లు పాల్గొన్నారు.

5న అండర్-19 క్రీడా జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా జూనియర్ కళాశాలల క్రీడా సంఘం ఆధ్వర్యాన ఈనెల 5న అండర్-19 బాల బాలికల కబడ్డీ, టేబుల్ టెన్నిస్ ఉమ్మడి జిల్లాస్థాయి జట్లను ఎంపిక చేయనున్నారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈ ఎంపికలు జరుగుతాయని సంఘం జిల్లా కార్యదర్శి మూసా కలీం తెలిపారు. క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రం, కళాశాల గుర్తింపు కార్డు తీసుకురావాలని సూచించారు.

వారం నిరీక్షణకు తెర

డోర్నకల్ వాసి మృతదేహం వెలికితీత



మృతదేహాన్ని తీసుకొస్తున్న శ్రీనివాసరావు, బృందం

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని మున్నేటికి వారం క్రితం కొట్టుకొచ్చిన వ్యక్తి మృతదేహాన్ని బుధవారం ధంసలాపురం వద్ద వెలికితీశారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌కు చెందిన బందెల వెంకటేశ్వర్లు (43) వాగులో చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతయ్యాడు. నాలుగు రోజుల తర్వాత మృతదేహం ప్రకాష్‌నగర్ చప్టా వద్ద చిక్కుకున్నట్లు త్రీటౌన్ పోలీసులు గుర్తించి గత శనివారం బయటకు తీసేందుకు సిద్ధమైనా వాగు ఉధృతి కారణంగా సాధ్యం కాలేదు. దీంతో అప్పటినుంచి ఆయన కుటుంబ సభ్యులు పడిగాపులు కాస్తున్నారు. కాగా, వరదలో కొట్టుకెళ్తూ బుధవారం ధంసలాపురం సమీపానికి చేరిన మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉండగా, ఖమ్మం అర్బన్ పోలీసులు, అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు బయటకు తీశారు. ఆతర్వాత కర్రకు కట్టుకుని పొదల నడుమ శ్రీనివాసరావు, ఆయన బృందం తీసుకురాగా పంచనామా అనంతరం కుటుంబానికి అప్పగించారు.

దసరా సందడి..

జిల్లా అంతటా దసరా సందడి నెలకొంది. విజయదశమి పర్వదినాన్ని గురువారం జరుపుకోనుండగా కొత్త వస్త్రాలు, ఇతర సామగ్రి కొనుగోళ్లకు వచ్చిన వారితో జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లు రద్దీగా మారాయి. రద్దీ కారణంగా చాలా చోట్ల రాకపోకలకు ఇక్కట్లు ఎదురయ్యాయి. కాగా, దసరా రోజునే గాంధీ జయంతి కావడంతో చికెన్, మటన్, వైన్స్ షాపులు బంద్ చేయాలని అధికారులు ముందుగానే నిర్వాహకులకు సూచించారు. ఈ విషయమై విస్తృత ప్రచారం జరగడంతో మద్యం, మాంసాన్ని పలువురు బుధవారం కొనుగోలు చేయడం కనిపించింది. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్



షాపింగ్‌కు వచ్చిన వారితో కిక్కిరిసిన కమాన్ బజార్



పెద్దతండా వద్ద బుధవారం రాత్రి మటన్ దుకాణంలో రద్దీ



ఖమ్మంరూరల్‌లో వైన్స్ వద్ద మద్యం కొనుగోళ్లు

తొమ్మిది మంది బైండోవర్

రఘునాథపాలెం: మండలంలోని వీ.వీ.పాలెంలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ కేసులో 9మందిని బుధవారం బైండోవర్ చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. వీరిని తహసీల్దార్ ఎదుట హాజరుపరచి వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేసినట్లు వెల్లడించారు.















అమ్మవారికి మంత్రుల పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే తదితరులు



ఖమ్మం వాసవీ ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి పొంగులేటి

కల్లూరు/ఖమ్మం గాంధీచౌక్: దేవీ శరన్నరాత్రి ఉత్సవాల సందర్భంగా కల్లూరులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన మండపాల్లో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి బుధవారం పూజలు చేశారు. మహిషాసుర మర్దని అలంకారంలో ఉన్న అమ్మవారికి పూజలు చేయగా, మంత్రి తుమ్మల పుల్లయ్యబంజర్ రోడ్డులో అన్నదానాన్ని ప్రారంభించారు. నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, భాగంప్రభాకర్, పోట్రు సత్యం, పైడి వెంకటేశ్వరరావు, దిరిశాల నరసింహారావు, లక్కినేని కృష్ణ, పెద్దబోయిన శ్రీను, పసుమర్తి చందర్‌రావు, చిత్తలూరి నరేష్, సముద్రాల పుల్లారావు, వేముల వాసు, చారుగుండ్ల నగేష్, చారుగుండ్ల అచ్యుతరావు, చలువాది నగేష్, దారా రంగా, దోసపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఖమ్మం గుట్టలబజార్‌లోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పూజలు చేశారు. శరన్నవరాత్రి ఆలయ చైర్మన్ మేళ్లచెర్వు వెంకటేశ్వరరావు ఉన్నారు.

సౌత్ జోన్ టోర్నీలో రాణించిన అథ్లెట్లు



క్రీడాకారులను అభినందిస్తున్న డీవైఎస్‌ఓ, తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: ఏపీ రాష్ట్రంలోని గుంటూరులో గత నెల23నుంచి 25వ తేదీ వరకు జరిగిన దక్షిణ భారతస్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. ఖమ్మం అథ్లెటిక్స్ అకాడమీకి చెందిన ఎస్.గోపీచంద్, ఎ.గౌతమ్, బి.వైశాలి, ఎస్.కే.ఆఫ్రిన్, బి.బిందు, మనుశ్రీ పలు పతకాలు సాధించారు. వీరిని డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి, అథ్లెటిక్స్ కోచ్ ఎం. డీ.గౌస్, అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు మందుల వెంకటేశ్వర్లు, ఎం.డీ.షఫీక్ అహ్మద్ బుధవారం అభినందించారు.

పెస్టిసైడ్ షాప్‌లో విజిలెన్స్ తనిఖీలు

తల్లాడ: తల్లాడ మండలంలోని బస్వాపురంలోని పెస్టిసైడ్ షాపులో బుధవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేశారు. లక్ష్మీ చైతన్య ట్రేడర్స్‌లో తనిఖీ చేసిన అధికారులు బేయర్ కంపెనీకి చెందిన క్రిమిసంహారక మందును స్వాధీనం చేసుకున్నారు. వీటిని పరిశీలన కోసం ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు విజిలెన్స్ సీఐ కిషోర్ తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ ఏఓ అలవాల శ్రీనివాసరావు, తల్లాడ ఏఓ ఎండీ.తాజుద్దీన్, ఏఈఓ శివ పాల్గొన్నారు.

ఆపదలోనూ అప్రమత్తత

ఫిట్స్ రావడంతో బస్సును పక్కన నిలిపిన డ్రైవర్

బోనకల్: బోనకల్ నుంచి ఖమ్మం వెళ్తున్న ఆర్టీసీ బస్సు బుధవారం ముష్టికుంట్ల సమీపానికి చేరగా డ్రైవర్ షేక్‌పాషాకు ఫిట్స్‌వచ్చాయి. అయితే, డ్రైవర్ బాధలోనూ అప్రమత్తమై రోడ్డు పక్కన బస్సు నిలి పాడు. దీంతో పాషాను 108లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సమయాన బస్సులో 40మంది ప్రయాణికులు ఉండగా, డ్రైవర్ అప్రమత్తం కావడంతో అంతా సురక్షితంగా బయటపడ్డారు. ఆతర్వాత మరో డ్రైవర్‌ను పిలిపించి బస్సు పంపించారు.

11నుంచి టీ.టీ. ర్యాంకింగ్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: ఈనెల 11నుంచి 13వరకు రాష్ట్రస్థాయి ఓపెన్ టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలసాని విజయ్, వి.సాంబమూర్తి తెలిపారు. రాష్ట్రంలోని ప్రతిభా వంతులైన క్రీడాకారులు ఈ టోర్నీకి హా జరవుతారని చెప్పారు. సన్యాసయ్య స్మారకార్థం నిర్వహించే ఈ టోర్నీకి హాజరయ్యే క్రీడాకారులకు ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తున్నామని వారు ఓ ప్రకటనలో వెల్లడించారు.

ఆలయానికి వెళ్తూ అనంత లోకాలకు..

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



లోకేశ్వరి (ఫైల్)

ఖమ్మంఅర్బన్: పిల్లలతో కలిసి ఆలయానికి వెళ్తున్న మహిళ మార్గ మధ్యలోనే రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడింది. ఖమ్మం మమత రోడ్డులో బుధవారం జరిగిన ఈ ప్రమాదంలో వివరాలు... మమత రోడ్డు ప్రాంతానికి చెందిన అనమోలు లోకేశ్వరి(34), తన పిల్లలైన అస్మిత, విరాట్‌తో కలిసి స్కూటీపై గుడికి బయలుదేరింది. మధ్యలో వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనగా స్కూటీ నడుపుతున్న లోకేశ్వరి తీవ్ర గాయాలతో పడిపోయింది. పిల్లలకు కూడా గాయాలు కాగా స్థానికులు వారిని మమత ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లోకేశ్వరి మృతి చెందింది. ఈమేరకు ఘటనపై కేసు నమోదుచేసినట్లు ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాశ్ తెలిపారు.

వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి..

ఖమ్మంరూరల్: మండలంలోని సత్యనారాయణపురం సమీపాన ఖమ్మం - వరంగల్ ప్రధాన రహదారిపై వాహనం ఢీకొనగా గుర్తుతెలియని వృద్ధుడు(60) బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. సదరు వృద్ధుడు రోడ్డు వెంట నడిచి వెళ్తుండగా వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయన ఎరుపు రంగు టీ షర్ట్, గీతల లుంగీ ధరించి ఉన్నాడని సీఐ ముష్క రాజు తెలిపారు. మృతదేహాన్ని అన్నం పౌండేషన్ చైర్మన్ శ్రీనివాస రావుసహకారంతో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి ..

కారేపల్లి: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఘటనకు సంబంధించి వివరాలు... మండలంలోని పేరుపల్లికి చెందిన సిరికొండ కృష్ణ(40) మోపెడ్‌పై బుధవారం కారేపల్లి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా రావోజీతండా వద్ద మూల మలుపు సమీపాన పేరుపల్లి నుంచి కారేపల్లి వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కృష్ణ కాలు విరిగి ఓ ఎముక కారు ముందు భాగంలో ఇరుక్కుపోయింది. అంతేకాక తలకు తీవ్ర గాయాలు కావడంతో కృష్ణను ఖమ్మం ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. ఘటనా స్థలంలో కారేపల్లి ఎస్‌ఐ ఎస్.నవిత పరిశీలించారు. మృతుడికి భార్య ఉమ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.























నేటి నుంచి ప్రైమ్ వాలీబాల్ లీగ్

సాక్షి, హైదరాబాద్: ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నేడు హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది. టోర్నీలో మొత్తం 10 జట్లు బరిలోకి దిగుతున్నాయి. నాలుగో సీజన్ పోటీల్లో భాగంగా జరిగే తొలి పోరులో డిఫెండింగ్ చాంపియన్స్ కాలికట్ హీరోస్‌తో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ తలపడుతుంది. మ్యాచ్‌లకు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం వేదిక కాగా, అక్టోబర్ 26న ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తారు. బుధవారం జరిగిన మీడియా సమావేశంలో లీగ్ సహ వ్యవస్థాపకుడు తుహిన్ మిశ్రా, సీఈఓ జాయ్ భట్టాచార్య తదితరులు పాల్గొని టోర్నీ వివరాలను ప్రకటించారు. గత మూడు సీజన్లతో పోలిస్తే ఈసారి లీగ్‌పై అభిమానుల్లో ఆసక్తి పెరిగిందని, టోర్నీని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని వారు వెల్లడించారు. మరోవైపు హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు పీవీఎల్ సీజన్ కోసం కొత్త జెర్సీని రూపొందించింది. తెలంగాణలోని ప్రఖ్యాత పోచంపల్లి ఇక్కత్ డిజైనింగ్ స్ఫూర్తిగా దీనిని తయారు చేసినట్లు టీమ్ యజమాని కంకణాల అభిషేక్ రెడ్డి వెల్లడించారు.



ఆస్ట్రేలియా బోణీ

- యాష్లే గార్డ్‌నర్ సెంచరీ
- 89 పరుగులతో ఓడిన న్యూజిలాండ్

ఇండోర్: మహిళల వన్డే వరల్డ్‌కప్ క్రికెట్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. న్యూజిలాండ్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 89 పరుగుల తేడాతో గెలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 326 పరుగులకు ఆలౌటైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' యాష్లే గార్డ్‌నర్ (83 బంతుల్లో 115; 16 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడి సెంచరీ సాధించింది. న్యూజిలాండ్ బౌలర్లలో లీ తహుహు, జెస్ కెర్ 3 వికెట్ల చొప్పున... బ్రీ ఇల్లింగ్, అమేలియా కెర్ 2 వికెట్ల చొప్పున పడగొట్టారు. 327 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ 43.2 ఓవర్లలో 237 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. కెప్టెన్ సోఫీ డివైన్ (112 బంతుల్లో 111; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు) వీరోచిత సెంచరీ సాధించినా ఫలితం లేకపోయింది. ఆసీస్ బౌలర్లలో సోఫీ, అనాబెల్ 3 వికెట్ల చొప్పున తీశారు. కొలంబోలో నేడు జరిగే మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో పాకిస్తాన్ తలపడుతుంది.

'ట్రోఫీ కావాలంటే వచ్చి తీసుకెళ్లండి'

ఆసియా కప్‌పై నఖ్వీ మంకుపట్టు

దుబాయ్: ఆసియా కప్ విజేతగా నిలిచిన భారత జట్టుకు ట్రోఫీని అందించకుండా అట్టిపెట్టుకున్న ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) చైర్మన్ మొహసిన్ నఖ్వీ మళ్లీ తన దురుద్దేశాన్ని బయటపెట్టాడు. టీమిండియాకు ట్రోఫీ కావాలంటే ఆసియా క్రికెట్ కౌన్సిల్ కార్యాలయానికి వచ్చి తీసుకోవచ్చని, అయితే అప్పుడు కూడా తానే ఇస్తానని అతను తన మొండితనాన్ని ప్రదర్శించాడు. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు చైర్మన్, కేంద్ర మంత్రి కూడా అయిన నఖ్వీ నుంచి తాము ట్రోఫీని అందుకోమని ఫైనల్ తర్వాత స్పష్టం చేసిన భారత జట్టు... కప్ లేకుండానే స్వదేశానికి వెళ్లిపోయింది. దాంతో నఖ్వీపై అన్ని వైపుల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి.

క్లీన్‌స్వీప్‌పై భారత్ గురి

సొంతగడ్డపై టెస్టుల్లో భారత్ దాదాపు 12 ఏళ్ల పాటు ఎదురులేని జట్టుగా ఒక్క సిరీస్ కూడా ఓడిపోకుండా ఆధిపత్యం ప్రదర్శించింది. పర్యటనకు వచ్చిన పెద్ద జట్లు కూడా టీమిండియా జోరును ఆపలేకపోయాయి. అయితే పుష్కర కాలం తర్వాత బలహీనం అనుకున్న న్యూజిలాండ్ పెద్ద దెబ్బ కొట్టింది. గత ఏడాది అనూహ్యంగా కివీస్ చేతిలో భారత్ క్లీన్‌స్వీప్‌నకు గురైంది. ఆ తర్వాత ఇప్పుడు మళ్లీ మన టీమ్ స్వదేశంలో టెస్టు మ్యాచ్ బరిలోకి దిగుతోంది. ఈసారి కూడా బలహీనమైన వెస్టిండీస్ ఎదురుగా ఉంది. ఇంగ్లండ్‌పై చక్కటి ప్రదర్శన తర్వాత ఎలాంటి ఉదాసీనతకు తావు ఇవ్వకుండా ఆడితే విండీస్‌పై పైచేయి ఖాయం. ఈ నేపథ్యంలో రెండు మ్యాచ్‌ల సిరీస్‌కు రంగం సిద్ధమైంది.

- నేటి నుంచి వెస్టిండీస్‌తో తొలి టెస్టు
- జోరు మీదున్న గిల్ బృందం
- సంచలనంపై విండీస్ ఆశలు
- ఉదయం గం. 9:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



గిల్



రోస్టన్ ఛేజ్

అహ్మదాబాద్: శుబ్‌మన్ గిల్ నాయకత్వంలో భారత జట్టు సొంతగడ్డపై తొలి టెస్టు సిరీస్ ఆడనుంది. వెస్టిండీస్‌తో జరిగే రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా నేటి నుంచి మొదటి టెస్టు జరుగుతుంది. సీనియర్లు కోహ్లి, రోహిత్, అశ్విన్‌ల రిటైర్మెంట్ తర్వాత టీమిండియా స్వదేశంలో ఆడనున్న మొదటి టెస్టు ఇదే కానుంది. ఇంగ్లండ్ గడ్డపై అద్భుత ఆటతో సిరీస్‌ను సమం చేసుకున్న టీమిండియా పటిష్టంగా కనిపిస్తోంది. మరోవైపు ఆసీస్‌తో ఆడిన గత టెస్టులో '27 ఆలౌట్' తర్వాత విండీస్ ఇదే మ్యాచ్‌లో బరిలోకి దిగుతోంది. బలాబలాల్లో ఎంతో అంతరం కనిపిస్తుండగా, కరీబియన్ టీమ్ ఇక్కడ ఏమాత్రం పోటీనిస్తుందనేది సందేహమే.

అదనపు పేసర్‌తో...

సాధారణంగా స్వదేశంలో నల్లరేగడి మట్టితో సిద్ధం చేసే స్పిన్ అనుకూల పిచ్‌లపై భారత్ ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈసారి టీమ్ మేనేజ్‌మెంట్ ఉద్దేశపూర్వకంగా పేస్‌కు అనుకూలించే 'ఎర్ర మట్టి' పిచ్‌పై తమ సత్తాను పరీక్షించుకోవాలని భావిస్తోంది. దీని ప్రకారమే తుది జట్టు ఉండవచ్చు. ఇద్దరు ప్రధాన పేసర్లుగా బుమ్రా, సిరాజ్ ఖాయం. స్పిన్ ఆల్‌రౌండర్లుగా జడేజా, సుందర్ ఖాయం. అయితే మూడో స్పిన్నర్ అయిన కుల్దీప్, మరో పేసర్ మధ్య పోటీ ఉండవచ్చు. పిచ్‌ను బట్టి చూస్తే ప్రసిధ్ వైపే మొగ్గు కనిపిస్తోంది. అయితే ఆరో స్థానంలో ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ రెడ్డిని ఆడిస్తే అప్పుడు కుల్దీప్‌కు అవకాశం ఉంటుంది. నితీశ్ జట్టులోకి వస్తే బ్యాటర్ పడిక్కల్‌ను కూడా పక్కన పెట్టాల్సి రావచ్చు. ఇంగ్లండ్‌లో పెద్దగా ఆకట్టుకోకపోయినా నితీశ్‌పై సెలక్టర్లు నమ్మకం ఉంచారు. బ్యాటింగ్‌పరంగా యశస్వి, గిల్, రాహుల్ చక్కటి ఫామ్‌లో ఉండగా సుదర్శన్ కూడా ఇటీవల ఆస్ట్రేలియా 'ఎ'పై సత్తా చాటాడు.

అందరూ అంతంతే!

'మా గెలుపుపై ఎవరికీ అంచనాలు లేకపోవడమే మా బలం. ఓటమి భయం లేకుండా స్వేచ్ఛగా ఆడతాం. కివీస్‌ను ఆదర్శంగా తీసుకుంటాం' అని వెస్టిండీస్ కెప్టెన్ రోస్టన్ ఛేజ్ చెబుతున్నాడు. కానీ భారత్‌లో టెస్టులు అంటే ఎంతో కష్టమో విండీస్‌కు బాగా తెలుసు. 1994లో భారత్‌ను ఓడించిన తర్వాత ఇక్కడ ఆడిన 10 టెస్టుల్లో విండీస్ 8 ఓడి, 2 'డ్రా' చేసుకుంది. 2018లో ఆడిన సిరీస్‌లో 2 టెస్టులూ మూడు రోజులకే ముగిశాయి! పట్టుదలగా క్రీజ్‌లో నిలబడి జట్టును నడిపించగల బ్యాటర్ ఎవరూ కనిపించడం లేదు. హోప్, ఛేజ్, వారికన్‌లకు మాత్రమే ఇక్కడ ఆడిన అనుభవం ఉండగా, జేడెన్ సీల్స్ ఇటీవల ఆకట్టుకుంటున్నాడు. ప్రధాన పేసర్లు అల్జారీ జోసెఫ్, షామర్ జోసెఫ్ గాయంతో సిరీస్‌కు దూరం కావడం పెద్ద లోటు. విండీస్ కూడా ముగ్గురు పేసర్లతో ఆడనుంది.

తుది జట్లు (అంచనా)

భారత్: గిల్ (కెప్టెన్), జైస్వాల్, రాహుల్, సుదర్శన్, జురేల్, నితీశ్ రెడ్డి/పడిక్కల్, జడేజా, సుందర్, బుమ్రా, సిరాజ్, కుల్దీప్/ప్రసిధ్. **వెస్టిండీస్:** ఛేజ్ (కెప్టెన్), చందర్‌పాల్, కెవ్లాన్ అండర్సన్, అతనజె, బ్రెండన్ కింగ్, షై హోప్, గ్రీవ్స్, ఫైర్, వారికన్, ఫిలిప్ అండర్సన్, సీల్స్.

పిచ్, వాతావరణం

పిచ్‌పై పచ్చికను ఎక్కువగా ఉంచారు. పేస్ బౌలింగ్‌కు అనుకూలం కాగా బ్యాటర్లు పట్టుదల కనబర్చాల్సి ఉంది. నగరంలో అనూహ్యంగా కురుస్తున్న వర్షాలు మ్యాచ్‌కు స్వల్పంగా అంతరాయం కలిగించవచ్చు.

అభిషేక్ అదుర్స్

టి20 ర్యాంకింగ్స్ చరిత్రలో అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన భారత ఓపెనర్



దుబాయ్: ఇటీవల ముగిసిన ఆసియాకప్ టి20 టోర్నమెంట్‌లో దంచికొట్టిన భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మ... అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ర్యాంకింగ్స్‌లోనూ సత్తా చాటాడు. ఈ ఫార్మాట్ చరిత్రలో అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన ప్లేయర్‌గా అభిషేక్ రికార్డు నెలకొల్పాడు. బుధవారం విడుదల చేసిన టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అభిషేక్ 931 రేటింగ్ పాయింట్లతో 'టాప్'లో నిలిచాడు. 2020లో ఇంగ్లండ్ ప్లేయర్ డేవిడ్ మలాన్ 919 రేటింగ్ పాయింట్లు సాధించి రికార్డు సృష్టించగా... ఐదేళ్ల తర్వాత దాన్ని అభిషేక్ సవరించాడు. టీమిండియా తరఫున గతంలో సూర్యకుమార్ యాదవ్ 912 రేటింగ్ పాయింట్లు, విరాట్ కోహ్లి 909 రేటింగ్ పాయింట్లు సాధించగా... ఇప్పుడు అభిషేక్ ఆ ఇద్దరినీ దాటేసి అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసుకున్నాడు. ప్రస్తుతం ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో ఉన్న ఫిల్ సాల్ట్ (844 పాయింట్లు) కంటే అభిషేక్ 82 రేటింగ్ పాయింట్లు ముందున్నాడు. పాకిస్తాన్‌తో ఆసియా కప్ ఫైనల్లో అజేయ అర్ధశతకంతో జట్టును గెలిపించిన హైదరాబాద్ ప్లేయర్ తిలక్ వర్మ (819 పాయింట్లు) మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. భారత టి20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (698 పాయింట్లు) రెండు స్థానాలు కోల్పోయి 8వ ర్యాంక్‌లో ఉన్నాడు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో భారత స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (803 పాయింట్లు) అగ్రస్థానంలో కొనసాగుతుండగా... ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో హార్దిక్ పాండ్యా (233 పాయింట్లు) 'టాప్' ర్యాంక్ నుంచి రెండో స్థానానికి చేరగా... పాకిస్తాన్ ప్లేయర్ సయీమ్ అయూబ్ (241 పాయింట్లు) నాలుగు ర్యాంక్‌లు మెరుగుపరుచుకొని అగ్రస్థానం దక్కించుకున్నాడు. ఆసియాకప్‌లో బ్యాట్‌తో ఆకట్టుకోలేకపోయిన అయూబ్ బంతితో 8 వికెట్లు తీశాడు.

ముకేశ్‌కు పసిడి పతకం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) జూనియర్ ప్రపంచకప్ టోర్నీని భారత్ 'టాప్' ర్యాంక్‌తో ముగించింది. చివరిరోజు బుధవారం భారత్‌కు మూడు పతకాలు లభించాయి. జూనియర్ పురుషుల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆంధ్రప్రదేశ్ షూటర్ ముకేశ్ నేలవల్లి స్వర్ణ పతకాన్ని సాధించాడు. గుంటూరు జిల్లాకు చెందిన ముకేశ్ 585 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. భారత్‌కే చెందిన సాహిల్ 573 పాయింట్లతో కాంస్య పతకాన్ని గెల్చుకున్నాడు. ఈ టోర్నీలో ముకేశ్‌కిది రెండో పతకం. అంతకుముందు ముకేశ్ 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో రజతం గెలిచాడు. జూనియర్ మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్ ఫైనల్లో భారత షూటర్ తేజస్విని 30 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించింది. ఓవరాల్‌గా భారత్ 8 స్వర్ణాలు, 10 రజతాలు, 8 కాంస్యాలతో కలిపి మొత్తం 26 పతకాలతో 'టాప్' ర్యాంక్‌లో నిలిచింది.



మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

ఓజీ విజయం నా ఒక్కడిది కాదు - పవన్ కల్యాణ్

''ఓజీ' సినిమా విజయం నా ఒక్కడిది కాదు.. ఇందుకు కారణమైన మా టీమ్‌కి ధన్యవాదాలు'' అని పవన్ కల్యాణ్ చెప్పారు. ఆయన హీరోగా, ప్రియాంక మోహన్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'ఓజీ'. సుజీత్ దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన ఈ సినిమా సెప్టెంబరు 25న రిలీజ్ అయ్యింది. హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఓజీ బ్లాక్‌బస్టర్ సెలబ్రేషన్స్'లో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ– ''ఓ మూవీ ఫెయిల్యూర్‌కి నేనెప్పుడూ భయపడలేదు. ఇటీవల విడుదలైన 'హరి హర వీరమల్లు' సినిమాకి కూడా. నేను చాలా సార్లు ఫెయిల్ అయింది టీమ్ వర్క్ లేకే తప్ప నా ఎఫర్ట్స్ ఎప్పుడూ తగ్గవు. నాకు అన్నం పెట్టిన తల్లి సినిమా. ఈ రోజు ఉప ముఖ్యమంత్రిగా నేనున్నానంటే అది సినిమా ఇచ్చిందే. ఓడిపోతే నిస్సహాయత ఎలా ఉంటుందో తెలుసు.. సినిమా అపజయమైతే ఆ నిస్సహాయత ఎలా ఉంటుందో తెలుసు. సినిమా బాగున్నప్పుడు అందరూ ఉంటారు కానీ, బాగాలేనప్పుడు మన దగ్గర ఎవరు నిలబడతారో వాళ్లే మనవాళ్లు. నేనెప్పుడూ ఫెయిల్యూర్‌ని ఎదుగుదలకు ఒక మెట్టుగా చూస్తానే తప్ప అవరోధంగా చూడను. నేను సినిమా కంటే పెద్దది చేస్తున్నాను.. అదే రాజకీయం. చాలా కష్టమైన పని. సినిమాల్లో విలన్స్‌తో గొడవ పడటం ఈజీ. నిజ జీవితంలో అలా ఉండదు.. తల ఎగిరిపోవచ్చు కూడా. అది నాకు ఎక్స్‌ట్రా రిస్క్. కానీ, దేశంపై నాకు పిచ్చి ప్రేమ ఉంది. అందరి హీరోల సినిమాలు చూస్తాను. ప్రతి హీరో కష్టాన్ని నేను అభినందిస్తాను. అందరి హీరోల అభిమానులను నేను కోరుకునేది ఒక్కటే. ఫ్యాన్ వాయిస్‌ని ఆపేయండి.. అలాంటి స్లోగన్స్‌తో దయచేసి సినిమాని చంపేయకండి. ఇప్పుడు ఓ సినిమా జీవితం అనేది కేవలం ఆరు రోజులు అయిపోయింది. నిర్మాతలు సినిమాలు చేసేందుకు ముందుకు రాకపోతే ఎంతోమంది ఉపాధి కోల్పోతారు'' అన్నారు.



సుజీత్, పవన్ కల్యాణ్, డీవీవీ దానయ్య, తమన్

శశిరేఖ పరిచయం

చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు'. 'పండగకి వస్తున్నారు' అన్నది ట్యాగ్ లైన్. 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఈ సినిమా 2026 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదిలా ఉంటే... ఈ చిత్రంలో నయనతార చేస్తున్న శశిరేఖ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్.
ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కెమెరా: సమీర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. కృష్ణ, లైన్ ప్రొడ్యూసర్: నవీన్ గారపాటి.




నయనతార



సోనాక్షీ సిన్హా

సుధీర్ బాబు, సోనాక్షీ సిన్హా లీడ్ రోల్స్‌లో నటించిన సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ 'జటాధర'. ఈ పాన్–ఇండియా ద్విభాషా (తెలుగు, హిందీ) చిత్రానికి వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో ధన పిశాచిగా కనిపిస్తారు సోనాక్షీ సిన్హా. ఈ పాత్రకు సంబంధించిన 'ధన పిశాచి...' పాటను విడుదల చేశారు. సమీరా కొప్పికర్ స్వరపరచిన ఈ పాటకు శ్రీ హర్ష ఈమని సాహిత్యం అందించగా, సాహితీ చాగంటి ఆలపించారు. దివ్య ఖోస్లా, శిల్పా శిరోద్కర్ తదితరులు నటించిన ఈ చిత్రాన్ని జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పణలో ఉమేష్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, శిల్పా సింఘాల్, నిఖిల్ నందా నిర్మించారు. నవంబరు 7న హిందీ, తెలుగు భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.

మాస్ జాతర ఫిక్స్



రవితేజ

రవితేజ హీరోగా నటించిన 'మాస్ జాతర' చిత్రం కొత్త విడుదల తేదీ ఖరారు అయింది. ఈ నెల 31న ఈ చిత్రం విడుదల కానుంది. రవితేజ నటించిన 75వ చిత్రం 'మాస్ జాతర'. భాను భోగవరపు దర్శకత్వం వహించారు. 'ధమాకా' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత రవితేజ–శ్రీలీల రెండోసారి జోడీగా నటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. పలుమార్లు విడుదల వాయిదా పడ్డ ఈ చిత్రాన్ని ఈ నెల 31 విడుదల చేయనున్నట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ''వింటేజ్ వైబ్స్, పక్కా కమర్షియల్ అంశాలతో రూపొందిన చిత్రం 'మాస్ జాతర'. మాస్ ప్రేక్షకులతో పాటు కుటుంబ ప్రేక్షకులు కూడా మెచ్చే విధంగా వాణిజ్య అంశాలతో అసలైన పండగ సినిమాలా ఈ చిత్రాన్ని తీశారు భాను భోగవరపు. రవితేజను ఎలా చూడాలని అభిమానులు, ప్రేక్షకులు కోరుకుంటారో అందుకు తగ్గట్టుగానే అందరూ మెచ్చేలా మాస్ రాజాను తెరపై చూపించారాయన. మా సినిమా థియేటర్లలో అసలు సిసలైన మాస్ పండగను తీసుకురాబోతోంది'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: విధు అయ్యన్న, సంగీతం: భీమ్స్.

నిశ్చితార్థానికి వేళాయె



అల్లు శిరీష్

ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తనయుడు, హీరో అల్లు శిరీష్ త్వరలో పెళ్లి పీటలు ఎక్కనున్నారు. ఈ నెల 31న నయనికతో తన నిశ్చితార్థం జరగనున్నట్టు బుధవారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు శిరీష్. కాబోయే భార్యతో ఈఫిల్ టవర్ వద్ద దిగిన ఓ ఫొటోను (చేతులు మాత్రమే కనిపించేలా) పంచుకున్నారు. ''మా తాత అల్లు రామలింగయ్య జయంతి (అక్టోబరు 1) సందర్భంగా నా మనసుకు దగ్గరైన ఒక విషయాన్ని అందరితో పంచుకుంటున్నాను. నేను, నయనిక ఈ నెల 31న నిశ్చితార్థం చేసుకోబోతున్నాం. ఇటీవల కన్నుమూసిన మా నానమ్మ కనకరత్నంగారు ఎప్పుడూ నేను పెళ్లి చేసుకోవాలని కోరుకునేవారు. ఇప్పుడు ఆమె మా మధ్య లేకపోయినప్పటికీ మమ్మల్ని ఆమె ఆశీర్వదిస్తారని నమ్ముతున్నాను'' అంటూ పోస్ట్ చేశారు. నయనిక హైదరాబాద్‌కు చెందిన అమ్మాయి అని టాక్. అయితే ఆమె గురించి పూర్తి వివరాలు మాత్రం తెలియాల్సి ఉంది.

సరికొత్త విలయ తాండవం



ఆకాశ్ పూరి, కార్తీక్ రాజు

కార్తీక్ రాజు, పార్వతి అరుణ్, 'పుష్ప' మూవీ ఫేమ్ జగదీష్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'విలయ తాండవం'. వీఎస్ వాసు దర్శకత్వంలో జీఎంఆర్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై మందల ధర్మారావు, గుంపు భాస్కరరావు నిర్మించారు. దసరాని పురస్కరించుకుని ఈ సినిమా టైటిల్ పోస్టర్ లాంచ్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హీరో ఆకాశ్ పూరి, డైరెక్టర్ భీమనేని శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఆకాశ్ పూరి మాట్లాడుతూ– ''విలయ తాండవం' టైటిల్ ఎంతో పవర్‌ఫుల్‌గా ఉంది. టైటిల్ పోస్టర్ చూస్తుంటే గూస్ బంప్స్ వస్తున్నాయి'' అన్నారు. ''నేను తీసిన 'కౌసల్యా కృష్ణమూర్తి' చిత్రంలో కార్తీక్ నటించాడు. 'విలయ తాండవం'తో తనకి మరో హిట్ రావాలి'' అన్నారు భీమనేని శ్రీనివాసరావు. ''సరికొత్త పాయింట్, కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు డైరెక్టర్ వాసు'' అని కార్తీక్ రాజు చెప్పారు. ''అద్భుతమైన కథతో ఈ సినిమా తీశాం'' అన్నారు మందల ధర్మా రావు, గుంపు భాస్కర రావు, వీఎస్ వాసు.

వేట షురూ



గుణి, తరుణ్ భాస్కర్, వేణు

టీను ఆనంద్, ఉపేంద్ర, జార్జ్ మరియన్, అక్షయ్ లగుసాని, విష్ణు, కార్తికేయ, విస్మయశ్రీ, మాళవి ప్రధాన పాత్రల్లో రూపొందనున్న చిత్రం 'బా బా బ్లాక్ షీప్'. గుణి మంచికంటి దర్శకత్వంలో దోణెపూడి చక్రపాణి సమర్పణలో చిత్రాలయం స్టూడియోపై వేణు దోణెపూడి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన కథ, కాన్సెప్ట్‌ను పరిచయం చేస్తూ ఓ మోషన్ పోస్టర్‌ను డైరెక్టర్ తరుణ్ భాస్కర్ చేతుల మీదుగా రిలీజ్ చేయించారు. ''గన్స్, గోల్డ్ చుట్టూ జరిగే వేట.. ముగ్గురి తెలివితేటలు... ఒక రోజులో జరిగే ఘటనలు... ఓ ఆరుగురి ప్రయాణంతో న్యూ ఏజ్ క్రైమ్ కామెడీగా ఈ చిత్రం రాబోతోంది'' అని యూనిట్ పేర్కొంది.

టీజర్ చాలా బాగుంది - అనిల్ రావిపూడి



గోపాల్, రామచంద్ర, అనిల్ రావిపూడి, రమణ్

''మటన్ సూప్' టైటిల్ బాగుంది. టీజర్ చాలా బాగుంది. దర్శకుడు రామచంద్ర, హీరో రమణ్, చిత్రయూనిట్‌కి అభినందనలు. ఈ నెల 10న రాబోతున్న ఈ చిత్రాన్ని అందరూ చూసి, పెద్ద విజయం అందించాలి'' అని డైరెక్టర్ అనిల్ రావిపూడి తెలిపారు. రమణ్, వర్ష విశ్వనాథ్ జంటగా రామచంద్ర వట్టికూటి దర్శకత్వం వహించిన చిత్రం 'మటన్ సూప్'. రామకృష్ణ వట్టికూటి సమర్పణలో అలుక్కా స్టూడియోస్, శ్రీ వారాహి ఆర్ట్స్, భవిష్య విహార్ చిత్రాలు బ్యానర్లపై మల్లికార్జున ఎలికా (గోపాల్), అరుణ్ చంద్ర వట్టికూటి, రామకృష్ణ సనపల నిర్మించారు. ఈ నెల 10న ఈ చిత్రం విడుదల కానుంది. బుధవారం ఈ సినిమా టీజర్‌ను అనిల్ రావిపూడి రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా రామచంద్ర వట్టికూటి మాట్లాడుతూ– ''మా సినిమాని అందరూ పెద్ద హిట్ చేయాలి'' అని కోరారు. ''మంచి స్క్రీన్ ప్లేతో మా చిత్రం రాబోతోంది'' అన్నారు మల్లికార్జున ఎలికా. ''నేటి ట్రెండ్‌కు తగ్గ కథ ఇది'' అని రామకృష్ణ సనపల, అరుణ్ చంద్ర వట్టికూటి చెప్పారు. ''మా దర్శక, నిర్మాతలు ఎంతో కష్టపడి ఈ సినిమా రూపొందించారు'' అన్నారు రమణ్.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



విరాజ్, యశశ్రీ రావు

విరాజ్ అశ్విన్, ప్రియదర్శిని రామ్, బాబూ మోహన్, యశశ్రీ రావు, పవన్ సిద్ధు, టేస్టీ తేజ, సూర్య గోపీనాథ్, శివన్నారాయణ ముఖ్య తారలుగా కొత్త సినిమాకి కొబ్బరి కాయ కొట్టారు. వినోద్ గాలి రచన, దర్శకత్వంలో ఈటీవీ విన్‌తో కలిసి 90స్ కిడ్స్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై శరత్ చంద్ర నాయుడు నిర్మిస్తున్న ఈ చిత్రం బుధవారం ఆరంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత రవిశంకర్ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు హరీష్ శంకర్ క్లాప్ కొట్టగా, నిర్మాత ఎస్‌కేఎన్ దర్శకత్వం వహించారు. నిర్మాత బన్నీ వాసు, డైరెక్టర్ మెహర్ రమేష్, ప్రసాద్ నిమ్మకాలయ, నిఖిల కోనేరు తదితరులు అతిథులుగా హాజరై, యూనిట్‌కి అభినందనలు తెలిపారు. ''బలమైన భావోద్వేగాలతో కూడిన బడ్డీ కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: రెహాన్ షేక్, సంగీతం: సుహాస్.